**Eenadu**

# ఎస్సీ గురుకులాల్లో 775 ఉద్యోగాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఎస్సీ సంక్షేమశాఖ కొత్తగా ప్రారంభించనున్న పది సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, గురుకుల క్రీడా పాఠశాల, సెంటర్‌ఫర్ ఎక్సలెన్స్ కేంద్రానికి 775 ఉద్యోగాలను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉద్యోగాల్లో 657 శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయనుండగా, 118 పోస్టులను పొరుగుసేవల (అవుట్ సోర్సింగ్) ద్వారా భర్తీ చేస్తారు. ఎస్సీ సంక్షేమ శాఖ ప్రతిపాదనల మేరకు 775 బోధన, బోధనేతర పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్.శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంజూరు చేసిన పోస్టుల్లో పీజీటీ, టీజీటీ, వార్డెన్‌లు, ప్రిన్సిపాళ్లు, పీఈటీ, లైబ్రేరియన్, స్టాఫ్‌నర్సులు, క్రాఫ్టు టీచర్లు, మ్యూజిక్ టీచర్లు, జూనియర్ లెక్చరర్లు, జూనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ సహాయకులు, సీనియర్ అసిస్టెంట్‌లు సహా వివిధ ఉద్యోగాలు ఉన్నాయి. టీజీటీలు 414, పీజీటీలు 90, ప్రిన్సిపాల్ పోస్టులు12తో పాటు వివిధ బోధన, బోధనేతర పోస్టులను మంజూరు చేశారు. కొత్తగా బెల్లంపల్లి (బాలురు), మానకొండూరు (బాలురు), అలంపూర్ (బాలురు), చెన్నూరు (బాలికలు), వర్ధన్నపేట (బాలురు), దానవాయిగూడెం (బాలికలు), కుల్చారం (బాలికలు), గోపాలపేట (బాలికలు), దోమకొండ (బాలికలు), గచ్చిబౌలి (బాలికలు) కరీంనగర్‌లో సెంటర్‌ఫర్ ఎక్సలెన్స్ కేంద్రం, రాయికోటలో గురుకుల క్రీడా పాఠశాలలు ప్రారంభించనున్నారు.